సాక్షి ప్రకాశం

ఆదివారం। 10। మార్చి। 2024



100 మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దారవీడు మండలం నుంచి దోర్నాల మండలం చినగుడిపాడుకు అక్రమంగా తరలిస్తున్న 100 మద్యం బాటిళ్లు, ఒక బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - IIలో..



అథ్లెటిక్స్‌లో క్రీడాకారుడి ప్రతిభ

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పందిళ్లపల్లికి చెందిన క్రీడాకారుడు ఆర్.ప్రదీప్‌నాయుడు రెండో స్థానంలో నిలిచి సత్తాచాటాడు. - IIలో..

గరిష్టం/కనిష్టం
34.5/26.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలించిన వైవీ



ర్యాంప్‌ను పరిశీలిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

మేదరమెట్ల: నేడు కొరిశపాడు మండలం పీ గుడిపాడు సమీపంలో నిర్వహించనున్న సిద్ధం సభా ప్రాంగణాన్ని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శనివారం రాత్రి పరిశీలించారు. సభా ప్రాంగణం, ఏర్పాట్లు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం తర్వాత ప్రజల వద్దకు వెళ్లి అభివాదం చేసే ర్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చినహనిమిరెడ్డి, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా టీజేఆర్

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందన్నారు. సంబంధిత రీజినల్ కో ఆర్డినేటర్ ఆధ్వర్యంలో డిప్యూటీ కో ఆర్డినేటర్ పని చేస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

సఫాయి మిత్ర సర్వేని వేగవంతం చేయండి

ఒంగోలు సిటీ: పారిశుధ్య కార్మికులంతా వారి వివరాలను యాప్‌లో నమోదు చేయించుకుని సఫాయి మిత్ర సర్వేని వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జి.వి.నారాయణ రెడ్డి ఆదేశించారు. స్థానిక డీపీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేసి వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు సఫాయి మిత్ర యాప్ తోడ్పడుతుందన్నారు. స్వచ్ఛ కార్మికుల జీవనోపాధిని పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. హైరిస్క్ కార్మికుల ఆరోగ్య భద్రతను మెరుగుపరచడంలో ఈ యాప్ దోహదపడుతుందని అన్నారు.



మేదరమెట్ల వద్ద సిద్ధం సభా వేదిక



వేదిక ముందు ప్రాంగణం

సమరభేరికి సిద్ధం

దారులన్నీ మేదరమెట్ల వైపే...

ప్రత్యర్థి పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా అధికార వైఎస్సార్ సీపీ నిర్వహించిన మూడు సిద్ధం సభలను మించేలా మేదరమెట్ల సిద్ధం సభకు లక్షలాదిగా పార్టీ శ్రేణులు తరలిరానున్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా.. ఎన్ని కుట్రలు చేసినా ఎన్నికల సమరానికి సిద్ధమంటున్నాయి వైఎస్సార్ సీపీ శ్రేణులు. సార్వత్రిక ఎన్నికల రణరంగానికి మేము సైతం సిద్ధమంటూ జిల్లా నలుమూలల నుంచి లక్షలాదిగా నాయకులు, కార్యకర్తలు మేదరమెట్ల వద్ద నేడు జరగనున్న సిద్ధం సభకు తరలివెళ్లనున్నారు. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట కోసం పార్టీ కేడర్ సిద్ధం సభకు పయనమవుతోంది. ప్రతి వాహనం మేదరమెట్ల వైపు పరుగులు తీయనుంది.



టార్గెట్ 175 ఫ్లెక్సీ



కనుచూపు మేరలో ఫ్లెక్సీలే..

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: భీమిలి, దెందులూరు, రాప్తాడు సిద్ధం సభలు లక్షల్లో తరలివచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులతో దిగ్విజయమయ్యాయి. చివరగా ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధి మేదరమెట్ల వద్ద అంతకుమించి నిర్వహిస్తున్న నాలుగో సిద్ధం మహాసభకు భారీ ఏర్పాట్లు జరిగాయి. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. జిల్లా నుంచి లక్షలాదిగా తరలివెళ్లేందుకు పార్టీ క్యాడర్ సిద్ధమవగా అందుకు తగ్గట్లుగా నేతలు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఒంగోలు, దర్శి, సంతనూతలపాడు, కొండపి, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం ,కనిగిరి నియోజకవర్గాల నుంచి కూడా భారీ స్థాయిలో వైఎస్సార్ సీపీ కేడర్, అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్తున్నారు. వేలాదిగా బస్సులు, కార్లు, ఇతర వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాల్లో కూడా సిద్ధం సభకు తరలివెళ్తున్నారు. ఒకవైపు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్ర, శనివారాలు జాగారాలున్నా.. సిద్ధం సభకు తరలివెళ్లేందుకు ప్రత్యేకంగా మహిళలు సైతం సన్నద్ధమవుతున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి తరలివెళ్లే వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకు సంబంధించిన రూట్లను ప్రకటించారు కూడా. జిల్లా కేంద్రమైన ఒంగోలు నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో తరలివెళ్లేలా మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా కసరత్తు చేశారు. బస్సులు, కార్లు, ఆటోల్లోనే కాకుండా ద్విచక్ర వాహనాలపై సిద్ధం సభకు వెళ్తున్నారు. గిద్దలూరు నియోజకవర్గానికి సంబంధించి మార్కాపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వేలాదిగా వాహనాలు తరలివెళ్తున్నాయి. ప్రతి మండలంలోని ప్రతి గ్రామం నుంచి బస్సులు, సొంత వాహనాల్లో సిద్ధం సభకు పార్టీ కేడర్, అభిమానులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పే మాటలు విందామని వెళ్తున్నారు. పార్టీ మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు సిద్ధం సభకు పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లేందుకు సన్నాహాలు చేశారు. యర్రగొండపాలెంలో పార్టీ సమన్వయకర్త తాడిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీగా జనసమీకరణ చేశారు. కనిగిరిలో కూడా అన్ని మండలాల నుంచి పార్టీ కేడర్ ఎంతో ఆనందంగా వెళ్లనున్నారు. కనిగిరి నియోజకవర్గానికి నూతనంగా నియమించిన సమన్వయకర్త దద్దాల నారాయణయాదవ్ కూడా భారీ స్థాయిలో సిద్ధం సభకు వెళ్లేందుకు తన కేడర్‌ను సమాయత్తం చేస్తున్నారు.

కొండపి నియోజకవర్గంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ ప్రతి మండలంలో తిరుగుతూ సిద్ధం సభకు తరలి వెళ్లేలా ఉత్సాహనిస్తున్నారు. వందలాదిగా బస్సులు, కార్లు, వేలాదిగా ద్విచక్ర వాహనాలు మేదరమెట్లవైపు పయనమయ్యేందుకు సిద్ధం చేస్తున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మేరుగు నాగార్జున ఆ నియోజకవర్గం నుంచి వేలాది వాహనాల్లో సిద్ధం సభకు ప్రజలను తరలించేందుకు సన్నద్ధం చేశారు.

ఒంగోలు నుంచి వాహనాల దారి మళ్లింపు...

సిద్ధం సభ కోసం ఒంగోలు నగరం నుంచి వాహనాలను జిల్లా పోలీస్ అధికారులు దారి మళ్లించారు. సభకు భారీ సంఖ్యలో పార్టీ కేడర్, అభిమానులు తరలిరానున్నందున వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు నిబంధనలు అమలులో ఉంటాయని ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఇప్పటికే ప్రకటించారు.

- నెల్లూరు వైపు నుంచి ఒంగోలు మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను ఒంగోలు దక్షిణ బైపాస్ నుంచి సంఘమిత్ర ఆస్పత్రి, పాత మినీ బైపాస్ మీదుగా చీమకుర్తి, పొదిలి, మార్కాపురం, కుంట జంక్షన్, వై.పాలెం, మాచర్ల మీదుగా దారి మళ్లించారు.
- ఒంగోలు నుంచి విశాఖపట్నం వైపు ఎన్‌హెచ్-16పై వెళ్లే వాహనాలను త్రోవగుంట ఫ్లై ఓవర్ బ్రిడ్జి కిందగా ఎన్‌హెచ్ 216పైకి దారిమళ్లించారు. చీరాల, బాపట్ల, చెరుకుపల్లి, పెనుమూడి-పులిగడ్డ వారధి, మచిలీపట్నం మీదుగా వెళ్లే రూట్ మ్యాప్ సిద్ధం చేశారు.
- ఒంగోలు వైపు నుంచి గుంటూరు, విజయవాడ వైపు ఎన్‌హెచ్-16పై వెళ్లే వాహనాలను త్రోవగుంట ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద నుంచి ఎన్‌హెచ్-216కి చీరాల, బాపట్ల, పొన్నూరు మీదుగా దారి మళ్లించారు.
- మేదరమెట్ల గ్రోత్ సెంటర్ నుంచి బొల్లాపల్లి టోల్ ప్లాజా వరకు ఇతర వాహనాలను అనుమతించరు. కేవలం సిద్ధం సభ ప్రాంగణానికి వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.



బెలూన్లు, జెండాలతో కళకళలాడుతున్న సభా ప్రాంగణం





ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ పాల్‌రాజు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్, ప్రకాశం ఎస్పీ పరమేశ్వరరెడ్డి, పోలీస్ అధికారులు

పేదల కళ్లలో ఆనందం కోసం..

- అన్ని రకాల అడ్డంకులు ఎదుర్కొని ఇళ్ల స్థల పట్టాల పంపిణీ
- స్థలంలో రెండుమూడు అంతస్తులైనా నిర్మించుకోవచ్చు
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు
- ఒంగోలులోని పలు డివిజన్లలో పట్టాలు, దుస్తుల పంపిణీ
- పాల్గొన్న వైఎస్సార్ సీపీ యువనేత ప్రణీత్ రెడ్డి, శ్రీకావ్య దంపతులు

ఒంగోలు సబర్బన్: నగరంలోని పేదల కళ్లలో ఆనందం కోసం ప్రతిపక్షాలు సృష్టించిన అన్ని రకాల అడ్డంకులు ఎదుర్కొని ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న స్థలాల్లో లబ్ధిదారులు సొంతంగా రెండుమూడు అంతస్తులు కూడా నిర్మించుకోవచ్చని చెప్పారు. నగరంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి సంబంధిత పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం పలు డివిజన్లలో నిర్వహించారు. నగరంలోని 50, 46, 7, 17, 37, 20, 24, 18 డివిజన్లతో పాటు 2వ డివిజన్‌లోని కేశవరాజుకుంటలో కూడా పంపిణీ చేశారు. వరుసగా ఏడో రోజు పట్టాల పంపిణీతో పాటు లబ్ధిదారులైన దంపతులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని బాలినేని చేపట్టారు. శనివారంతో మొత్తం 48 డివిజన్లలో పంపిణీ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. ఇప్పటి వరకు దాదాపు 20 వేలకుపైగా పట్టాలు పంపిణీ చేశారు. ఇంకా మూడు డివిజన్లు మాత్రమే మిగిలిపోగా, వాటిలో సీఎం జగన్ సిద్ధం సభ పూర్తయిన అనంతరం పంపిణీ చేయనున్నారు. శనివారం నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమాల్లో బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు లాంఛనంగా ప్రారంభించగా వారి తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య దంపతులు అందరికీ పంపిణీ చేసుకుంటూ ముందుకు సాగారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నగరంలో సొంతిళ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. సొంతిళ్లు లేని ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఇంటి స్థల పట్టా ఇచ్చి సొంతిల్లు నిర్మించి ఇద్దామన్నదే తన ప్రధాన ఆలోచనగా పెట్టుకున్నానన్నారు. అందుకే ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థల పట్టాలిస్తేనే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయనని గతంలో ప్రకటించానని గుర్తు చేశారు. నూతనంగా ఇస్తున్న ఇళ్ల స్థల పట్టాల ద్వారా నగరంలోని రెండు ప్రాంతాల్లో రెండు టౌన్‌షిప్‌లను నూతనంగా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అగ్రహారం వద్ద, వెంగముక్కలపాలెం వద్ద నగర పరిధిలోనే ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గేటెడ్ కమ్యూనిటీ మాదిరిగా ఏర్పాటు చేస్తామన్నారు. తనను ఐదు సార్లు ఎమ్మెల్యేగా చేసిన ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే భాగ్యంగా భావిస్తున్నానని బాలినేని సంతోషంగా అన్నారు. అందులో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేరుస్తున్నానని వెల్లడించారు. ఒంగోలు నగరంలో మొత్తం 25 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. దీన్ని అడ్డుకునేందుకు టీడీపీ నాయకులు పన్నిన కుట్రలను గట్టిగా ఎదుర్కొన్నామని చెప్పారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఒంగోలు నగరంలో సొంతిళ్లు లేని నిరుపేదలకు పట్టాలిచ్చి ఇళ్లు కట్టిద్దామని గత ఐదు సంవత్సరాలుగా పూనుకుంటే.. టీడీపీ నాయకులు అదేపనిగా హైకోర్టుకు వెళ్లి ఆపేయించిన విషయాన్ని వివరించారు. టీడీపీ నాయకులు, ముఖ్యంగా ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని ధ్వజమెత్తారు. వాళ్లు ఇన్ని చేస్తున్నా.. ఎమ్మెల్యే బాలినేని పోరాడి ప్రభుత్వం నుంచి డబ్బు తీసుకొచ్చి పట్టాలు పంపిణీ చేస్తున్నారన్నారు. పట్టాల వ్యవహారాన్ని జీర్ణించుకోలేక కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి వెంకట్రావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు అంబటి ప్రసాదు, గుట్లపల్లి మస్తానమ్మ, చెన్నుపాటి వేణుగోపాల్, నాగం వెంకట శేషయ్య, తేళ్లపల్లి ధనలక్ష్మి, పసుపులేటి విజయలక్ష్మి శ్రీనివాసరావు, బేతంశెట్టి శైలజ, ఆయా డివిజన్ల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, అధికారులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులను సన్మానిస్తున్న మహిళలు

శివయ్యకు శోభాయాత్ర



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పొదిలి పట్టణంలోని పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి ఆలయ రథోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారు అధిరోహించిన రథాన్ని లాగేవారిదే అదృష్టం.. చూసే కన్నులదే భాగ్యం అన్నట్లుగా రథయాత్ర సాగింది. హరహర మహాదేవ..శంభోశంకర నామస్మరణతో వీధులన్నీ మార్మోగాయి. వేలాది మంది భక్తులు పాల్గొనగా, స్వామివారి ఉత్సవమూర్తులను రథంపై ఉంచి పొదిలి పురవీధుల్లో ఊరేగించారు.

– పొదిలి రూరల్

జాతీయ అథ్లెటిక్స్‌లో పందిళ్లపల్లి క్రీడాకారుడి ప్రతిభ

వేటపాలెం: జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పందిళ్లపల్లి క్రీడాకారుడు ఆర్. ప్రదీప్‌నాయుడు రెండో స్థానం సాధించాడు. శనివారం కర్ణాటక రాష్ట్రం ఉడిపిలో సౌత్ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో 12 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని రెండో స్థానంలో నిలిచి సిల్వర్ పతకం సాధించాడు. ఈపోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి ఆరుగురు క్రీడాకారులు పాల్గొనగా కేరళ క్రీడాకారుడు మొదటి స్థానం సాధించగా, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ప్రదీప్ రెండో స్థానంలో నిలిచాడు. మహారాష్ట్రకు చెందిన క్రీడాకారుడు మూడో స్థానం సాధించాడు. గతేడాది నవంబర్‌లో కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ్‌లో ఓపెన్ నేషనల్ మారథాన్ పోటీల్లో ప్రదీప్‌నాయుడు మూడో స్థానం సాధించాడు. ఈపోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం సాధించాడు.



రథోత్సవానికి శంఖం పూరిస్తున్న భక్తుడు



రథంపై ఉంచిన ఉత్సవ మూర్తులు



జనంతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

- పొదిలిలో వైభవంగా నిర్మమహేశ్వరుని రథోత్సవం
- జన సంద్రంగా మారిన పురవీధులు
- రథాన్ని అధిరోహించిన గౌరీశంకరుడు
- కుల, మతాలకు అతీతంగా తరలివచ్చిన అశేష ప్రజానీకం

మనోహరం.. జనహోరం!

పొదిలి రూరల్: మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పొదిలి (పృథులాపురి పట్టణం)లో వేంచేసియున్న పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారు అధిరోహించిన రథ యాత్ర కనుల పండువగా సాగింది. హరహర మహాదేవ..శంభోశంకర అనే శివ నామస్మరణతో వీధులన్నీ మార్మోగాయి.

కల్యాణం..కమనీయం

స్థానిక నిర్మమహేశ్వరస్వామి దేవాలయంలో అర్చక స్వాములు మూలంరాజు సుబ్బన రసయ్య, దరిశి వెంకట సుధాకర్, దరిశి రామ మూర్తి శుక్రవారం తెల్లవారు జామున 2 గంటలకు నిర్మమహేశ్వరుడు, పార్వతీదేవీలకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. 3 గంటలకు ఉత్సవ మూర్తులకు నంది సేవ నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చారు. గౌరిశంకర అలంకరణతో ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చారు. స్వామి వారికి నీటితో వారుపోసి కుంభం పెట్టి పార్వేట బలి యడంతో వేలాది మంది భక్తజనం వెంటరాగా మధ్యాహ్నం 2.45 గంటలకు రథం కదిలింది. ఈ వేడుకను తిలకించడానికి పొదిలి పరిసర గ్రామాల నుంచి గాక, జిల్లా నలుమూలలు నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. మార్కాపురం సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, ఆలయ చైర్మన్ యక్కలి శేషగిరిరావు, నగర కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, కేవీ రమణారెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు నూర్జహాన్ బేగం, డి. శ్రీనివాసరెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి కల్లం సుబ్బారెడ్డి, కార్యదర్శి గొలమారిచెన్నా రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు, సేవదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాయి రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె. నరసింహ రావు, వినోద్, కొత్తపులి బ్రహ్మారెడ్డి, సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల పిచ్చిరెడ్డి, ముక్కు శ్రీను, కోగరవెంకటరావు, ఫిరోజ్, జూపల్లి ఏడుకొండలు ఆవుల జయరామిరెడ్డి, సంగు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు స్వాగతం పలికిన పాలక మండలి సభ్యులు

అడుగడుగునా అన్నదాన కార్యక్రమాలు

పట్టణవాసులు స్వచ్ఛందంగా భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వివిధ ధార్మిక సంఘాలు మంచినీరు, మజ్జిగ, చల్లని పానీయాలు పంపిణీ చేశాయి. వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అన్నారాంబాబు ప్రారంభించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భారీ పోలీసు బందోబస్తు

రథోత్సవం సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ పర్యవేక్షణలో పొదిలి, త్రిపురాంతకం సీఐలు మల్లిఖార్జునరావు, సుబ్బారావు అధ్వర్యంలో పొదిలి, కొనకనమిట్ల, తాడివారిపల్లి ఎస్సైలు జి. కోటయ్య, మాధవ రావు, సుధాకర్ తమ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. విద్యుత్‌కు సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా విద్యుత్ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎలాంటి అవరోధాలు, ఆటంకాలు లేకుండా రథోత్సవం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

పాముకాటుకు వ్యక్తి మృతి



సంతాపం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: మండలంలోని చిన్నకొలుకుల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయుకుడు బత్తి వెంకటరాయుడు పాముకాటుకు గురై మృతి చెందాడు. శుక్రవారం రాత్రి తన పొలంలో ఆరబెట్టిన మిరప పంటకు కాపలాగా వెళ్లిన ఆయన పాముకాటుకు గురయ్యాడని, మరుసటి రోజు పొలం వద్ద పడి ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులు గుర్తించారని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఎస్.వెంకటరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కె.జయరావు, నాయకులు యక్కలి అప్పారావు, బి.వెంకటరత్నం, ఎం.యల్లయ్య, బి.వెంకటనారాయణ, కె.కిట్టయ్య, జి.చెన్నయ్య, బి.మల్లయ్య నివాళులర్పించారు.

సచివాలయ ఉద్యోగి అదృశ్యం

మార్కాపురం: పట్టణంలోని 1వ సచివాలయంలో ఎడ్యుకేషన్ అసిస్టెంటుగా పనిచేస్తున్న సిద్ధంశెట్టి నరేంద్రకుమార్ గత నెల 13వ తేదీ ఇంటి నుంచి బయటకువెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు శనివారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

100 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న సెబ్ సిబ్బంది

మార్కాపురం: పెద్దారవీడు మండలం నుంచి దోర్నాల మండలం చిన్నగుడిపాడుకు అక్రమంగా తరలిస్తున్న 100 లిక్కర్ బాటిళ్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సెబ్ ఎస్సై గోపాలకృష్ణ తెలిపారు. పెద్దారవీడు ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి పెద్దదోర్నాల మండలం గుడిపాడుకు చెందిన నాగేశ్వరరావు సుమారు 100 లిక్కర్ బాటిళ్లను శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తరువాత తన టూ వీలర్‌పై తీసుకునివెళ్తుండగా పెద్దారవీడు లిమిట్స్ దాటిన తరువాత ఊరి శివారులో నాగేశ్వరరావును అదుపులోనికి తీసుకుని విచారించారు. ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి కొనుగోలుచేసి చిన్నగుడిపాడుకు తీసుకెళ్తున్నట్లు చెప్పడంతో లిక్కర్‌బాటిళ్లను, టూవీలర్‌ను స్వాధీనం చేసుకుని నాగేశ్వరరావుతో పాటు సేల్స్‌మెన్ ఎం. నారాయణరెడ్డిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది జీవీ సాల్మన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.